సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

7

బుధవారం । 4 । జనవరి । 2023

గరిష్టం / కనిష్టం
32° / 19°

వాతావరణం
జిల్లాలో బుధవారం పగటి పూట ఉష్ణోగ్రత సాధారణంగానే ఉంటుంది. రాత్రి వేళ చలి ప్రభావం ఉండవచ్చు.

న్యూస్‌రీల్

పునఃప్రారంభమైన నిత్యకల్యాణాలు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి వారి దేవస్థానంలో మంగళవారం స్వామి వారి నిత్య కల్యాణాలు పునఃప్రారంభమయ్యాయి. ముక్కోటి ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాలను పురస్కరించుకొని గత నెల 23 నుంచి ఈ నెల 2వ తేదీ వరకు నిత్యకల్యాణాలను ఆపివేశారు. పగల్ పత్తు ఉత్సవాల ముగింపు అనంతరం మంగళవారం స్వామి వారికి బేడా మండపంలో నిత్యకల్యాణం కమనీయంగా జరిగింది. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామి వారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. మంగళవారం సందర్భంగా ఆంజనేయస్వామి ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు గావించారు.

అంబసత్రంలో రాపత్తు సేవ



అంబసత్రంలో పూజలు చేస్తున్న అర్చకుడు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో జరుగుతున్న వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలలో భాగంగా మంగళవారం అంబసత్రం వారి ఆధ్వర్యంలో రాపత్తు సేవ నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులను మంగళవాయిద్యాలు, శ్రీరామ నామస్మరణల నడుమ పల్లకీ సేవగా అంబసత్రానికి తీసుకొచ్చి ప్రత్యేక పూజలు చేశారు. హారతి సమర్పించారు. ఆలయ అర్చకులు భక్తులకు స్వామివారి ఆశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేదపండితులు, అంబసత్రం నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

సీడీపీఓ పరీక్ష ప్రశాంతం



అభ్యర్థుల పత్రాలను పరిశీలిస్తున్న సిబ్బంది

సుజాతనగర్: టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన సీడీపీఓ నియామక పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 10 నుంచి 12:30 వరకు, 2:30 నుంచి 5 గంటల వరకు రెండు పరీక్షలు నిర్వహించారు. మొత్తం 110 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 76 మంది హాజరయ్యారు. 34 మంది గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రానికి 9.15లోపే రావాలని అధికారులు నిర్దేశించగా, ఆలస్యంగా వచ్చిన ఆరుగురిని పరీక్షకు అనుమతించలేదు.

ఇల్లెందు డిపో రెడీ..

- తది దశలో డిపో నిర్మాణ పనులు
- మరో మూడు రోజుల్లో ఆర్టీసీకి అప్పగింత
- సంక్రాంతికి ప్రారంభించే అవకాశం
- నెరవేరనున్న నాలుగు దశాబ్దాల కల



డిపోలో సిద్ధమవుతున్న సర్వీస్ షెడ్



ఆవరణలో పూర్తికావొచ్చిన డిపో కార్యాలయ పనులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఇల్లెందు నియోజకవర్గ ప్రజల చిరకాల వాంఛ అయిన బస్ డిపో నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. అన్ని అనుకూలిస్తే సంక్రాంతికి డిపో నుంచి బస్సు సర్వీసులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. దీంతో జిల్లా ప్రజలకు మరో బస్ డిపో అందుబాటులోకి రానుంది. జిల్లాలో ప్రస్తుతం కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరులలో మూడు డిపోలు ఉన్నాయి. గతంలో రెండు సార్లు ఇల్లెందుకు ఆర్టీసీ బస్‌డిపో మంజూరైనా, చివరి నిమిషంలో అవి ఇతర ప్రాంతాలకు తరలిపోయాయి. దీంతో స్థానికంగా ఏజెన్సీ గ్రామాలతో పాటు దూర ప్రాంతాలకు ఇక్కడి నుంచి బస్సు సర్వీసులు కలగానే మిగిలిపోయాయి. రాష్ట్ర రాజధానికి వెళ్లాలన్నా అరకొరగానే బస్సులు అందుబాటులో ఉన్న పరిస్థితి నెలకొంది. దూర ప్రాంతాలకు రాకపోకలు సాగించేందుకు ఖమ్మం, మహబూబాబాద్ రైల్వే స్టేషన్లపై ఆధారపడాల్సి వస్తోంది. రైలు సమయాలకు అనుకూలంగా బస్సులు లేక అవస్థలు పడుతున్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ కేబినెట్‌లో రవాణా శాఖ మంత్రిగా నియమితులు కావడంతో డిపో ఏర్పాటుపై మళ్లీ ఆశలు చిగురించాయి. ఎట్టకేలకు 2020లో ఇల్లెందుకు శాటిలైట్ డిపోను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది.

చివరిదశలో...

ఇల్లెందు బస్‌డిపో నిర్మాణానికి 2021 ఫిబ్రవరిలో శంకుస్థాపన జరగ్గా ఏడాదిలోగా నిర్మాణం పూర్తి కావాల్సి ఉంది. అయితే నిర్మాణ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ జాప్యం చేయగా.. పనుల్లో వేగం పెంచాలని, లేదంటే కఠిన చర్యలు తప్పవంటూ కలెక్టర్ అనుదీప్ గత నవంబర్‌లో హెచ్చరించారు. అప్పటి నుంచి డిపో పనులు పుంజుకున్నాయి. మరో మూడు నాలుగు రోజుల్లో పనులన్నీ పూర్తి చేసి ఆర్టీసీకి డిపోను అప్పగించనున్నారు.

పూర్తయిన గ్యారేజీ పనులు

సుమారు రెండెకరాల స్థలంలో శాటిలైట్ బస్‌డిపో పనులు పూర్తయ్యాయి. సుమారు వంద మందికి పైగా సిబ్బంది ఇక్కడి నుంచి పని చేయనున్నారు. సిబ్బంది పని చేసేందుకు అవసరమైన కార్యాలయాలు, బస్సులు నిలిపేందుకు స్థలం, రిపేరు చేసేందుకు వీలుగా గ్యారేజీ తదితర పనులన్నీ పూర్తయ్యాయి. డిపో ముందు భాగంలో గేటు సైతం బిగించారు. తలుపులు బిగించడం, పెయింటింగ్ వర్క్, ఫర్నిచర్, కంప్యూటర్ల ఏర్పాటు తదితర మైనర్ పనులు ఇంకా మిగిలి ఉన్నాయి. జనవరి పదిలోగా ఆర్టీసీకి డిపో భవనాలు, స్థలాన్ని హ్యాండోవర్ చేసే అవకాశం ఉంది. అన్ని అనుకూలిస్తే సంక్రాంతికి డిపో ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

26 బస్సులు, 100 మంది సిబ్బంది..

ఇల్లెందుకు డిపోకు అవసరమైన బస్సులు, సిబ్బంది కేటాయింపుపై ఆర్టీసీ ఉన్నతాధికారుల నుంచి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ డిపోలకు ఆదేశాలు వెళ్లాయి. ఈ మూడు డిపోల నుంచి వంద మంది సిబ్బందితో పాటు 23 బస్సులను ఇల్లెందు శాటిలైట్ డిపోకు కేటాయించనున్నారు. వీటితో పాటు మూడు కొత్త బస్సులు హైదరాబాద్ నుంచి నేరుగా డిపోకు అందేలా ప్రణాళిక రూపొందించారు. ఈ బస్సులు అందుబాటులోకి వస్తే స్థానికంగా ఉన్న ఏజెన్సీ గ్రామాలు, సుదూర ప్రాంతాలకు సర్వీసులు నడిపించడంతో పాటు ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా హైదరాబాద్‌కు మరిన్ని బస్సులు అందుబాటులోకి తెచ్చేందుకు వీలుంటుంది.

ఉభయతారకంగా బంక్

ఇల్లెందు శాటిలైట్ బస్ డిపోకు సంబంధించిన పెట్రోల్ బంకు నిర్మాణం ఇంకా పూర్తి కాలేదు. ఇటీవల సొంత స్థలాల్లో ఆర్టీసీ సంస్థ కమర్షియల్ పెట్రోల్ బంకులను నిర్మిస్తోంది. త్వరలోనే కొత్తగూడెంలో పెట్రోల్ బంక్ అందుబాటులోకి రానుంది. ఇల్లెందు బస్‌స్టేషన్, డిపోల సమీపంలోనే సువిశాలమైన సొంత స్థలం ఆర్టీసీకి అందుబాటులో ఉంది. దీంతో డిపో కోసం ప్రత్యేకంగా బంక్ నిర్మించే బదులు బస్‌స్టేషన్ ఆవరణలోనే కమర్షియల్ బంక్ నిర్మించే యోచనలో ఆర్టీసీ ఉన్నట్టు సమాచారం. తద్వారా డిపో అవసరాలను తీరుస్తూనే వ్యాపారపరంగా సంస్థకు ఉపయోగకరంగా ఉండేలా ప్లాన్ చేస్తున్నారు. బంక్ అందుబాటులోకి రాకుండా డిపోను ప్రారంభిస్తే తాత్కాలికంగా ప్రైవేటు బంక్‌ల నుంచి ఇంధనం తీసుకునేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

‘లక్ష్మీదేవిపల్లి ఠాణా’కు ఎస్పీ అభినందన



లక్ష్మీదేవిపల్లి ఎస్సై ప్రవీణ్, సిబ్బందిని అభినందిస్తున్న ఎస్పీ డాక్టర్ వినీత్

కొత్తగూడెంటౌన్: లక్ష్మీదేవిపల్లి పోలీస్ స్టేషన్‌కు రాష్ట్రస్థాయిలో ఉత్తమ అవార్డు రావడంపై ఎస్పీ డాక్టర్ వినీత్ అభినందించారు. మంగళవారం లక్ష్మీదేవిపల్లి ఎస్సై ప్రవీణ్, సిబ్బంది ఎస్పీ కార్యాలయంలో ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ వారిని, ఠాణా మొదటి స్థానంలో నిలిచేలా అధికారులకు, సిబ్బందికి సరైన ప్రోత్సాహం అందించిన కొత్తగూడెం డీఎస్పీ వెంకటేశ్వర్‌బాబు, చుంచుపల్లి సీఐ రమాకాంత్‌లను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు స్టేషన్‌ల పనితీరు, కేసుల దర్యాప్తు కచ్చితమైన నేర విశ్లేషణ, నేరాల నివారణ, సమర్థవంతమైన విచారణ, ప్రోయాక్టివ్ పోలీసింగ్, కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్ తదితర రక్షణ క్రియాత్మక రంగాల్లో చూపిన ప్రతిభ ఆధారంగా నాలుగు కేటగిరీల్లో నాలుగు పోలీసు స్టేషన్లను ఎంపిక చేశారని తెలిపారు. కేటగిరీ–4 (150–250 కేసులు)లో 2022 ఏడాదికి లక్ష్మీదేవిపల్లి ఉత్తమ పోలీసు స్టేషన్‌గా ఎంపికైందని పేర్కొన్నారు. పోలీసుశాఖలో కష్టపడి పని చేసే వారికి తగిన గుర్తింపు లభిస్తుందని తెలిపారు. ఇతర స్టేషన్ల అధికారులు, సిబ్బంది లక్ష్మీదేవిపల్లి పోలీసు స్టేషన్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

బ్రోచర్లు ఆవిష్కరణ

ఈ నెల 7, 8వ తేదీల్లో కొత్తగూడెం సింగరేణి కేసీఓఏ క్లబ్‌లో నిర్వహించే షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ భద్రాద్రి కొత్తగూడెం టోర్నమెంట్ బ్రోచర్లను మంగళవారం ఎస్పీ వినీత్ తన కార్యాలయంలో ఆవిష్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రాజశేఖర్ అయ్యప్ప, ప్రధాన కార్యదర్శి ఎం.చైతన్యకృష్ణ, తుత్తురు దామోదర్, తేలుకుంట్ల రామ్‌కుమార్, దేవన్న, కల్లూరి యతిరాజ్‌కుమార్, గౌస్, పండుగ రేశ్వంత్, దాసరి శ్రీనివాస్, ఎల్లండి రాము, భాగ్యరాజ్, సుధాకర్, తాటి హసన్‌కుమార్, సురేందర్ పాల్గొన్నారు.

జాతీయ అవార్డుకు ఎంపిక

మణుగూరు రూరల్: మండలంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీవీ కోటేశ్వరరావు జాతీయ అవార్డుకు ఎంపికయ్యారు. విద్యా, సాహిత్య రంగాల్లో హెచ్‌ఎం కోటేశ్వరరావు అందించిన విశేష సేవలకు తెలుగుతేజం జాతీయ విశిష్టసేవా పురస్కారం–2023కు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన్ను ఎంఈఓ వీరస్వామి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు నాగశ్రీ, శ్రీలత, రామనాగశర్మ, పటేల్ లక్ష్మీనారాయణ తదితరులు అభినందించారు.

పల్లెలకు పైసలొస్తున్నాయి..

- పంచాయతీ ఖాతాల్లో జమ చేస్తున్న కేంద్ర ప్రభుత్వం
- జిల్లాకు రూ.20 కోట్ల ఆర్థిక సంఘం నిధులు..
- ట్రాక్టర్ల ఈఎంఐ, సిబ్బంది వేతనాలకు మళ్లిస్తున్న అధికారులు
- చెప్పాపెట్టకుండా కేటాయిస్తున్నారని సర్పంచ్‌ల కినుక



పెనగడప గ్రామ పంచాయతీ కార్యాలయం

చుంచుపల్లి: ఎట్టకేలకు గ్రామపంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సంఘం నిధులు విడుదల చేసింది. నాలుగు రోజులుగా పంచాయతీల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేస్తోంది. ఈ ఏడాది గ్రామ పంచాయతీలకు రావాల్సిన 15 ఆర్థిక సంఘం నిధులు రాక కొన్ని నెలలుగా సర్పంచులు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. తాజాగా విడుదల చేయడంతో సర్పంచులకు కొంత ఉపశమనం కలగనుంది. కేంద్ర ప్రభుత్వం గత మార్చిలో గ్రామ పంచాయతీలను కొత్త ఖాతాలు తెరవాలని ఆదేశించడంతో సర్పంచులు, ఉప సర్పంచులు కలిసి జాయింట్‌గా అకౌంట్లు తెరిచారు. ఆర్థిక సంవత్సరం ప్రారంభం ఏప్రిల్ నుంచి నిధులు విడుదల కావాల్సి ఉంది. 20 రోజుల క్రితం కొత్త ఖాతాల్లో కేంద్రం మచ్చుకు 10 శాతం నిధులను జమ చేసింది. తాజాగా తొలి అర్ధ సంవత్సరం నిధులు విడుదల చేసి జమ చేస్తోందని అధికారులు చెబుతున్నారు. దీంతో గ్రామాలకు ఆర్థిక భరోసా కలనుగనుంది. కాగా కేంద్రం తాజాగా విడుదల చేసిన నిధుల్లోంచి అధికారులు చెప్పాపెట్టకుండా సీసీ చార్జీలు, ట్రాక్టర్ల ఈఎంఐలు, సిబ్బంది వేతనాల కోసం కోత విధించడాన్ని సర్పంచులు తప్పుబడుతున్నారు. కనీసం ముందస్తు సమాచారం లేకుండానే నిధులు వాటికి కేటాయిస్తున్నారని ఆరోపిస్తున్నారు. కేంద్ర నిధులను డ్రా చేయడానికి వీలు లేకుండా పలు షరతులు విధించడం పట్ల అసహనం వ్యక్తం చేస్తున్నారు.

మేజర్ పంచాయతీలకు ఐదారు రూ.లక్షలు..

జిల్లాలో 481 గ్రామపంచాయతీలు ఉన్నాయి. గ్రామాలకు పాలనపరమైన ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక సంఘం నిధులను మంజూరు చేస్తున్నాయి. ఈ నిధులను పారిశుద్ధ్యం, విద్యుత్, సిబ్బంది వేతనాలు, చెత్త సేకరణ ట్రాక్టర్ల నిర్వహణ, మంచినీటి వనరుల మరమ్మతులు తదితర పనులకు వినియోగిస్తారు. జిల్లాకు కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు ప్రతి నెలా రూ.10.14 కోట్ల చొప్పున విడుదల చేస్తున్నాయి. వీటిని ప్రతి మూడు, ఆరు నెలలకోసారి చొప్పున నేరుగా గ్రామ పంచాయతీల ఖాతాల్లో జమ చేస్తాయి. మేజర్ పంచాయతీలకు నెలకు రూ.5 నుంచి రూ.6 లక్షల వరకు వస్తుండగా, చిన్న పంచాయతీలకు రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు వస్తాయి. ఇక చిన్న గ్రామ పంచాయతీలకు ఆర్థిక వనరులు లేకపోవడంతో ప్రభుత్వాలు ఇచ్చే ఈ నిధులపైనే ఆధారపడాల్సి వస్తోంది.

ఆగస్టు వరకే రాష్ట్ర ప్రభుత్వ నిధులు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు గత ఆగస్టు వరకే విడుదలయ్యాయి. ఇప్పటివరకు వాటినే సర్దుబాటు చేసుకుంటూ సర్పంచులు పాలనను నెట్టుకొస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేయాల్సిన ఆర్థిక సంఘం నిధులు సకాలంలో రాకపోవడంతో ఇప్పటివరకు సర్పంచులు ఎదురుచూడాల్సి వచ్చింది. నెలకు రూ.10.14 కోట్ల చొప్పున జిల్లాకు మొదటి అర్ధ సంవత్సరానికి కేంద్ర ఆర్థిక సంఘం నుంచి రూ.60.84 కోట్లు రావాల్సి ఉంది. కానీ ఇప్పటివరకు రూ.20 కోట్ల మేర 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేసింది. మిగిలినవీ వారం రోజుల్లో పంచాయతీలకు విడుదలవుతాయని అధికారులు చెబుతున్నారు.

కొత్త ఖాతాల్లో జమ..



గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు రెండు రోజులుగా విడుదల అవుతున్నాయి. ఇవి నేరుగా ఆయా గ్రామ పంచాయతీల ఖాతాల్లో జమ అవుతున్నాయి. ఈ ఏడాది కేంద్ర ఆర్థిక సంఘం నిధులు రావడం కొంత ఆలస్యమైంది. ఇప్పటివరకు జిల్లాకు సుమారు రూ.20 కోట్ల మేర నిధులు వచ్చాయి. సర్పంచులు గతంలో ఇచ్చిన చెక్‌ల మాత్రమే సీసీ చార్జీలు, ట్రాక్టర్ల కిస్తీలకు నిధులు కేటాయిస్తున్నాం.

–రమాకాంత్, డీపీఓ

‘కంటి వెలుగు’కు పకడ్బందీగా చర్యలు

కలెక్టర్ అనుదీప్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఈ నెల 18 నుంచి నిర్వహించే కంటి వెలుగు కార్యక్రమం విజయవంతానికి పకడ్బందీగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ అనుదీప్ అన్నారు. కంటి వెలుగు కార్యక్రమంపై హైదరాబాద్ నుంచి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావు, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, విద్యుత్ శాఖ మంత్రి జగదీష్ రెడ్డి, పశుసంవర్ధక శాఖ మంత్రి శ్రీనివాస యాదవ్, సీఎస్ సోమేష్ కుమార్ మంగళవారం జిల్లా కలెక్టర్లు, వైద్యాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీసీకి కలెక్టర్ హాజరై జిల్లాలో చేపట్టబోయే కార్యక్రమాలను వివరించారు. అనంతరం మున్సిపల్, వైద్య, పంచాయతీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 481 గ్రామ పంచాయతీలు, 104 మున్సిపల్ వార్డుల్లో కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించేందుకు సూక్ష్మ ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. ప్రభుత్వ సెలవు దినాలు, శని, ఆదివారాల్లో ఈ క్యాంపులు జరగవని, మొత్తం 100 పనిదినాలలో కార్యక్రమం పూర్తవుతుందని వివరించారు. ఇందుకోసం జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూం(08744–246655) ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రచారం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కె.వెంకటేశ్వర్లు, కొత్తగూడెం, ఇల్లెందు మున్సిపల్ చైర్మన్లు కాపు సీతాలక్ష్మి, డి.వెంకటేశ్వర్లు, జిల్లా వైద్యాధికారి డాక్టర్ శిరీష, ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ రవిబాబు, జెడ్పీ సీఈఓ విద్యాలత, డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు, డీపీఓ రమాకాంత్, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

హాజరైన విప్

మణుగూరు రూరల్: మంత్రి హరీష్‌రావు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు మణుగూరు నుంచి హాజరై మాట్లాడారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

షెడ్ల కూల్చివేత.. మళ్లీ భూమి పూజ



మార్కెట్‌లో కూల్చివేసిన షెడ్లు

- తెల్లవారుజామునే మున్సిపల్ మార్కెట్‌లో గడబిడ
- అధికారుల తీరుకు నిరసనగా వ్యాపారుల ఆందోళన
- మద్దతుగా నిలిచిన సీపీఐ, సీపీఎం, బీఆర్‌ఎస్
- ఎమ్మెల్యే వనమా హామీ, తాత్కాలిక షెడ్లకు భూమి పూజ



ఆందోళన నిర్వహిస్తున్న వ్యాపారులు



మున్సిపల్ కార్యాలయంలో గేటు లోపలి నుంచి మాట్లాడుతున్న కమిషనర్ రఘు



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే వనమా

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపల్ మార్కెట్‌లో షెడ్ల కూల్చివేతకు నిరసనగా వ్యాపారులు చేపట్టిన ఆందోళన ఉద్రిక్తంగా మారింది. మున్సిపల్ మార్కెట్‌లోని షెడ్లలో కొందరు మూడు దశాబ్దాలుగా కూరగాయల వ్యాపారం చేసుకుంటున్నారు. వ్యాపారులకు ముందస్తుగా నోటీసులు, హెచ్చరికలు జారీ చేయకుండా మంగళవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో పదికిపైగా షెడ్లను మున్సిపల్ కమిషనర్ రఘు ఆదేశాల మేరకు జేసీబీతో సిబ్బంది తొలగించారు. సమాచారం అందుకున్న వ్యాపారులు మార్కెట్ వద్దకు చేరుకుని ఆందోళన నిర్వహించారు. వారికి మద్దతుగా సీపీఐ, సీపీఎం నాయకులు ఆందోళనలో పాల్గొన్నారు. అందరూ కలిసి అక్కడి నుంచి ర్యాలీగా సూపర్‌బజార్, బస్టాండ్ సెంటర్, పోస్టాఫీసు మీదుగా మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. అప్పటికే అక్కడ సిద్ధంగా ఉన్న పోలీసులు.. కార్యాలయంలోకి ఎవరూ రాకుండా గేట్లు మూసి తాళాలు వేశారు. దీంతో ఆందోళనకారులు మున్సిపల్ ఆఫీస్ ఎదుట, జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. ఆందోళన నాలుగుగంటలపాటు సాగింది. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబిర్ పాషా, వ్యాపారులు మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ వ్యాపార సముదాయాల నిర్మాణం పేరుతో అడ్డుగా ఉన్నాయని పేర్కొంటూ కూరగాయల షెడ్లను కూల్చివేశారని, కోర్టు స్టే ఆర్డర్‌ను ధిక్కరించారని ఆరోపించారు. ప్రత్యామ్నాయ వ్యాపార సముదాయాలకు రూ. కోటి మంజూరైనా నిర్మాణాలు చేపట్టకుండా షెడ్లు కూల్చివేసి పేదలను రోడ్డుపాలు చేశారని విమర్శించారు. కాగా మున్సిపల్ కమిషనర్ కార్యాలయం గేటు లోపల నుంచే ఆందోళనకారుల సమస్యలు విన్నారు. అనంతరం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ఆందోళన వద్దకు చేరుకుని వ్యాపారులకు మద్దతు నిలిచారు. తనకు తెలియకుండానే జరిగిందని, వ్యాపారులకు అండగా ఉంటానని, మార్కెట్‌లో ప్రత్యామ్నాయ షెడ్లు, కూరగాయాల మార్కెట్ నిర్మాణానికి భూమి పూజ చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళనకారులు శాంతించారు. కాగా వ్యాపారులు కార్యాలయంలోకి దూసుకొచ్చే ప్రయత్నం చేయగా, పోలీసులు అడ్డుకోవడంతో స్వల్ప తోపులాట జరిగింది. అనంతరం ఎమ్మెల్యే మున్సిపల్ మార్కెట్‌కు చేరుకుని మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి, కమిషనర్‌తో కలిసి ప్రత్యామ్నాయ షెడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో కౌన్సిలర్లు బోయిన విజయ్‌కుమార్, పి.సత్యనారాయణచారి, బండి నర్సింహ, సీపీఐ నాయకులు గుత్తుల సత్యనారాయణ, వై.శ్రీనివాసరెడ్డి, గెద్దాడు నగేష్, కె.జమలయ్య, కందుల భాస్కర్, భూక్య శ్రీనివాస్, కె. రత్నకుమారి, మాచర్ల శ్రీనివాస్, పిడుగు శ్రీనివాస్, షాహీన్, భాగ్యలక్ష్మి, విజయలక్ష్మి, మాతంగి లింగయ్య, లక్ష్మీనారాయణ, వ్యాపారులు లక్ష్మీనర్సింహారావు, రహమాన్, సజ్జు, కుమార్, సీపీఎం నాయకులు భూక్య శ్రీనివాస్, లిక్క బాలరాజు, లక్ష్మీ, బీఆర్‌ఎస్ నాయకులు భీమా శ్రీధర్, బాలిశెట్టి సుందర్‌రావు, కంభంపాటి దుర్గాప్రసాద్, మహ్మద్ యూసుఫ్, బ్యాండ్ రమణ, తదితరులు పాల్గొన్నారు.

సాఫీగా ముగించారు..

- పూర్తయిన పోలీసు అభ్యర్థుల దేహ దారుఢ్య పరీక్షలు
- 22 రోజుల్లో అర్హత సాధించిన 12,567 మంది
- చివరిరోజు పరిశీలించిన కలెక్టర్, కేఎంసీ కమిషనర్



లాంగ్ జంప్‌ను పరిశీలిస్తున్న ఖమ్మం కలెక్టర్ గౌతమ్, సీపీ వారియర్, అధికారులు

ఖమ్మం క్రైం: ఇరవై రెండు రోజులు.. 24వేల మందికి పైగా అభ్యర్థులు... ఇంత మంది ఈవెంట్లకు హాజరైనా ఎలాంటి లోటుపాట్లు ఎదురుకాకుండా, విమర్శలు రాకుండా ముగించిన ఖమ్మం పోలీసులు భేష్ అనిపించుకున్నారు. పోలీసు శాఖలోని వివిధ విభాగాల్లో స్టైఫండరీ ఎస్‌ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల ఎంపికకు గాను గత ఇరవై రెండు రోజులుగా జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఈవెంట్లు జరుగుతున్నాయి. దేహదారుఢ్య పరీక్షలు మంగళవారం ముగియగా, చివరి రోజు 939 మంది అభ్యర్థులు తుది పరీక్షలకు అర్హత సాధించారని అధికారులు వెల్లడించారు. కాగా, చివరి రోజు పరీక్షలకు సీపీ విష్ణు ఎస్.వారియర్‌తో కలిసి కలెక్టర్ వీ.పీ.గౌతమ్, మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, ట్రైయినీ కలెక్టర్ రాధికా గుప్తా పరిశీలించారు. మొత్తంగా 24,726 మంది అభ్యర్థులకు గాను 2,917 మంది గైర్హాజరు కాగా 21,809 మంది హాజరయ్యారు. వీరిలో 12,567 మంది అన్నింట్లో ఉత్తీర్ణులై తుది పరీక్షకు అర్హత సాధించారు.

డిసెంబర్ 8న ప్రారంభం

ఎస్సై, కానిస్టేబుల్ ప్రిలిమినరీ రాతపరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వారికి గతనెల 8వ తేదీ నుంచి దేహ దారుఢ్య పరీక్షలు మొదలుపెట్టారు. ఎన్నడూ లేనట్లుగా సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి ఈ పరీక్షలు నిర్వహించగా, ఎలాంటి అపవాదు రాకుండా పూర్తిచేయడంలో జిల్లా పోలీసులు సఫలమయ్యారు. ఎక్కడా మానవ ప్రమేయం లేకుండా రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ రైడర్ ప్యాడ్లు, సీసీ కెమెరాల నిఘా నీడలతో పరీక్ష నిర్వహించడం ద్వారా కచ్చితమైన ఫలితాలు వచ్చాయి. కాగా, ప్రతీ ఈవెంట్ వద్ద ఏసీపీ స్థాయి అధికారిని పర్యవేక్షణకు నియమించారు. ఇక తెల్లవారుజామున మొదలయ్యే ఈవెంట్లను సీపీ విష్ణు ఎస్.వారియర్ స్వయంగా పర్యవేక్షించారు. కాగా, ఈవెంట్లు సజావుగా సాగేలా కృషి చేసిన పోలీసు సిబ్బంది, కార్యాలయ సిబ్బంది, పీఈటీలు, వైద్య సిబ్బందితో పాటు సాంకేతిక నిపుణులకు మంగళవారం సీపీ ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు సుభాష్‌చంద్రబోస్, కుమారస్వామి, ఏఎస్పీ ఆకాంక్ష్ యాదవ్, ఏసీపీలు ప్రసన్న కుమార్, ఆంజనేయులు, బస్వారెడ్డి, వెంకటేష్, రవి, బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

అతి తక్కువ సమయంలోనే పూర్తి

రాష్ట్రంలోని పలుచోట్ల జరుగుతున్న ఈవెంట్లను పరిశీలిస్తే ఖమ్మంలోనే అతి తక్కువ సమయంలో పూర్తయ్యాయి. తెల్లవారుజామునే ఐదు గంటల నుంచి అభ్యర్థులు మైదానానికి వస్తుండగా, మధ్యాహ్నం 12గంటల్లోగా ఈవెంట్లు ముగించడం విశేషం. కాగా, అభ్యర్థులు అస్వస్థతకు గురైతే చికిత్స కోసం వైద్యులు, సిబ్బందిని నియమించడమే కాక ప్రత్యేకంగా బయో శౌచాలయాలు ఏర్పాటు చేశారు. కాగా, మహిళా అభ్యర్థులకు ప్రత్యేకంగా డిసెంబర్ 10నుంచి 14వ తేదీ వరకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు.

లాంగ్ జంప్, పరుగులోనే ఎక్కువ మంది..

ఎస్సై, కానిస్టేబుళ్ల ఎంపికకు నిర్వహించిన ఈవెంట్లలో తొలుత పరుగు పందెం నిర్వహించారు. ఆతర్వాత లాంగ్‌జంప్, ఇతర పరీక్షలు జరిగాయి. అయితే, ఎక్కువ మంది అభ్యర్థులు లాంగ్‌జంప్, పరుగుపందెంలో అర్హత కోల్పోయినట్లు అధికారులు వెల్లడించారు. మరికొందరు ఎత్తు తక్కువతో అర్హత కోల్పోగా, షాట్‌పుట్‌లో కొందరు అర్హత సాధించలేదు.

పారదర్శకంగా పూర్తిచేశాం...

అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు పారదర్శకంగా పూర్తిచేశాం. అత్యంత సాంకేతిక పరిజ్ఞానం వినియోగించడంతో ఎక్కడా లోటుపాట్లు ఎదురుకాలేదు. రిస్ట్‌బాండ్, చిప్ పరీక్షలు సజావుగా నిర్వహించటానికి దోహదపడ్డాయి, పోలీసులతో పాటు వైద్య సిబ్బంది, పీఈటీలు, ఐటీ నిపుణులు ఎంతో సహకరించారు.

– విష్ణు ఎస్.వారియర్, ఖమ్మం పోలీసు కమిషనర్

క్లుప్తంగా

టేకు దిమ్మెలు స్వాధీనం


పట్టుబడిన టేకు దిమ్మెలు

భద్రాచలంటౌన్: భద్రాచలం ఫారెస్ట్ సిబ్బంది అక్రమంగా తరలిస్తున్న టేకు దిమ్మెలను మంగళవారం పట్టుకున్నారు. పట్టణంలోని ఏపీ టూరిజం రోడ్డులో పల్సర్ బైక్‌పై టేకు దిమ్మెలను తీసుకెళ్తున్న వ్యక్తులను ఫారెస్ట్ సిబ్బంది సారయ్య, సిద్దు గుర్తించారు. వారిని వెంబడించగా టేకు దిమ్మెలను అక్కడే వదిలేసి వాళ్లు పారిపోయారు. పట్టుబడిన నాలుగు టేకు దిమ్మెలను సిబ్బంది ఫారెస్ట్ చెక్ పోస్టుకు తరలించారు.

పశువైద్యశాలలో చోరీ

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోని గ్రామీణ పశువైద్యశాలలో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు వైద్యశాల తలుపులు పగులగొట్టి లోపలికి ప్రవేశించి, పశువుల కృత్రిమ గర్భధారణ కోసం ఉపయోగించే ద్రవ నత్రజని కంటైనర్, మొబైల్ కంటైనర్, మైక్రోస్కోప్ అపహరించారు. మంగళవారం ఉదయం సిబ్బంది ఈ విషయాన్ని గుర్తించి ఇన్‌చార్జ్ పశువైద్యాధికారి ఎల్‌వీఎస్ రాంప్రసాద్‌కు చెప్పడంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీకి గురైన సామగ్రి విలువ రూ.65 వేల వరకు ఉంటుందని ఆయన తెలిపారు.

వినియోగదారుడికి రూ.1.63 లక్షలు చెల్లించండి

ఖమ్మంలీగల్: ఎలక్ట్రికల్ స్కూటర్ పనితీరు బాగాలేదని చెప్పినా పట్టించుకోకపోవడంతో కొనుగోలుకు చెల్లించిన నగదుతో పాటు నష్టపరిహారం చెల్లించాలని జిల్లా వినియోగదారుల ఫోరం చైర్మన్, మెంబర్ వి.లలిత, ఎ.మాధవీలత తీర్పుచెప్పారు. మంగళవారం వెలువడిన ఈ తీర్పు వివరాలిలా ఉన్నాయి. భద్రాద్రి జిల్లా చుంచుపల్లి మండలం రామాంజనేయ కాలనీకి చెందిన పొన్నెకంటి రాజీవ్‌కుమార్ బెంగళూరుకు చెందిన ఓలా ఎలక్ట్రికల్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ నుంచి గత ఏడాది ఏప్రిల్ 7న రూ.1,63,549 చెల్లించి ఎలక్ట్రికల్ స్కూటర్ కొనుగోలు చేశాడు. అయితే, కొన్నాళ్లకే పనితీరు బాగాలేకపోవడంతో డిస్ట్రిబ్యూటర్ దృష్టికి తీసుకెళ్లినా సరిగ్గా స్పందించలేదు. దీంతో న్యాయవాది కాళ్లూరి లక్ష్మీనర్సింహారావు ద్వారా నోటీసు జారీ చేసి, జిల్లా వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదును విచారించిన ఫోరం చైర్మన్ వినియోగదారుడు చెల్లించిన నగదుతో పాటు నష్టపరిహారం కింద రూ.20 వేలను చెల్లించాలని తీర్పు చెప్పారు.

లారీని ఢీకొన్న కారు


లారీని ఢీకొట్టిన కారు

దమ్మపేట: మంచు కురిసే సమయంలో లారీని, కారు ఢీకొట్టిన ఘటన మండలంలోని పట్వారిగూడెం గ్రామ శివారులో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మంగళవారం ఉదయం వేకువజామునే వరంగల్ జిల్లా నర్సంపేటకు చెందిన దూపాటి కనకయ్య.. స్వగ్రామం నుంచి కారులో దమ్మపేట గ్రామానికి డ్రైవింగ్ చేసుకుంటూ వస్తున్నాడు. ఈ క్రమంలో ఉదయం 7 గంటల సమయంలో పట్వారిగూడెం గ్రామ శివారులో తీవ్రంగా మంచు పడుతుంటడంతో దారి కనిపించక ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టాడు. కారులో ఎయిర్ బెలూన్లు తెరచుకోవడంతో డ్రైవింగ్ చేస్తున్న కనకయ్యకు ఎలాంటి ప్రమాదం సంభవించలేదు.

నవభారత్ స్విచ్ యార్డులో ప్రమాదం.. ఒకరు మృతి

పాల్వంచ: నవభారత్ పవర్ ప్లాంట్‌లో పనిచేస్తున్న సీనియర్ ఎలక్ట్రీషియన్ ప్రమాదశాత్తు పది మీటర్ల ఎత్తు నుంచి పడిపోవడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. టేకులపల్లి మండలం సులానగర్‌కు చెందిన దామల్ల బాబూరావు (33) పాల్వంచలోని నవభారత్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్‌లో సీనియర్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం షిఫ్ట్‌లో స్విచ్ యార్డ్‌లో పనిచేస్తూ పది మీటర్ల ఎత్తు నుంచి ప్రమాదశాత్తు జారీ కిందపడ్డాడు. దీంతో అతని శరీరంలోని అంతర్ భాగాలు దెబ్బతిన్నాయి. వెంటనే గుర్తించిన తోటి ఉద్యోగులు అధికారులకు సమాచారం అందించడంతో కొత్తగూడెం ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు. ఈ విషయమై నవభారత్ జీఎం రాజేశ్వరరావును వివరణ కోరగా సీనియర్ ఎలక్ట్రీషియన్ కింద పడటంతో ఖమ్మం తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారని తెలిపారు.

కర్మాగారం ఎదుట ధర్నా..

బాబూరావు మృతదేహాన్ని నవభారత్ వెంచర్స్ లిమిటెడ్ ప్రధాన గేటు ముందు ఉంచి కుటుంబ సభ్యులు ధర్నా చేపట్టారు. ధర్నాలో టేకులపల్లి మండలానికి చెందిన పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు. బాబూరావు కుటుంబాన్ని ఆదుకోవాలని, రూ.50 లక్షల నష్టపరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా రాత్రి వరకు కొనసాగింది.

దిగ్విజయంగా..

రాష్ట్రపతి పర్యటన, ముక్కోటి ఉత్సవాలు సక్సెస్

- ఊపిరి పీల్చుకున్న దేవస్థాన, ప్రభుత్వ యంత్రాంగం
- మళ్లీ మార్చిలో పుష్కర పట్టాభిషేకానికే హడావుడి


ఉత్తరద్వారం నుంచి సీతారామలక్ష్మణమూర్తులను దర్శించుకుంటున్న భక్తులు (ఫైల్)

భద్రాచలం: భద్రగిరి క్షేత్రంలో దేశ ప్రథమ పౌరురాలు ద్రౌపదీ ముర్ము పర్యటన, ముక్కోటి ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాలలో కీలకంగా భావించే తెప్పోత్సవం, ఉత్తర ద్వార దర్శనం కార్యక్రమాలు ప్రశాంతంగా ముగిశాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విజయవంతం కావడంతో ఇటు దేవస్థానం, అటు ప్రభుత్వ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. పర్యటనకు, భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా తీసుకున్న ప్రణాళికలు సఫలీకృతమయ్యాయి. దేవస్థానం ఈఓ శివాజీ, కలెక్టర్ అనుదీప్ నిరంతర పర్యవేక్షణతో అన్ని సవ్యంగా పూర్తయ్యాయి.

అధికారుల ఉక్కిరిబిక్కిరి

వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాలను విజయవంతం చేయాలని సమీక్షా సమావేశాలను నిర్వహిస్తున్న సమయంలో అనుకోకుండా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పర్యటన ఖరారు కావడంతో అధికారులు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ప్రధానంగా దేవస్థానం ప్రాంగణంలోనే ప్రసాద్ పథకం ప్రారంభం ఉండటంతో కలెక్టర్ అనుదీప్ ఆదేశాల మేరకు దేవస్థానం అధికారులు ఆగమేఘాల మీద పనులు చేపట్టారు. 28న రాష్ట్రపతి పర్యటన, జనవరి 1,2వ తేదీలలో తెప్పోత్సవం, ఉత్తర ద్వార దర్శనం ఉండటంతో ఇటు పర్యటన ఏర్పాట్లతో పాటు ఉత్సవాలలో భక్తుల కోసం సకల వసతులను సమకూర్చటంలో దేవస్థానం అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. దేవస్థానం ఈఓ శివాజీ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ అధికారులు, పాలనాధికారులు నిరంతరం పనుల పరవేక్షణలో మునిగితేలారు. కలెక్టర్ అనుదీప్ సైతం ఈ పర్యటనను, ఉత్సవాలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. పర్యటన, ఉత్సవాల విజయవంతానికి అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ ఉరుకులు పరుగులు పెట్టించారు. ఎస్పీ వినీత్ బందోబస్తు ఏర్పాట్లలో ప్రత్యేక శ్రద్ధ వహించారు. రెండేళ్ల కోవిడ్ విరామం అనంతరం జరిగిన శ్రీరామనవమి, ముక్కోటి ఉత్సవాలతోపాటు రాష్ట్రపతి పర్యటనను విజయవంతం చేసిన ఘనత కలెక్టర్ అనుదీప్‌కు దక్కింది. కాగా రాష్ట్రపతి పర్యటనలో అతిగా ట్రాఫిక్ నియమాలను విధించారనే ఆరోపణలు వినిపించాయి. రాష్ట్రపతి యాదాద్రిలో పర్యటనలో అక్కడి అర్చకులు, అధికారులకు అధిక సంఖ్యలో పాస్‌లు జారీ చేశారని, రాష్ట్రపతితో ఫొటో దిగే అరుదైన అవకాశాన్ని కల్పించారని, కానీ ఇక్కడ మాత్రం రాత్రింబవళ్లు కష్టపడ్డ దేవస్థానం అర్చకులు, అధికారులకు రాష్ట్రపతి పర్యటనలో పాల్గొనే అవకాశం ఇవ్వలేదనే అపవాదను మాత్రం జిల్లా అధికారులు మూటగట్టుకున్నారు.

మార్చిలో పుష్కర పట్టాభిషేకం..

జగాలను ఏలే జగదభి రాముడికి జరిగే పట్టాభిషేక మహోత్సవం ఎంతో ప్రత్యేకమైనది. దేవస్థానం ఆధ్వర్యంలో ప్రతి శ్రీరామనవమి మరుసటి రోజున పట్టాభిషేకం జరుపుతారు. ప్రతి 60 ఏళ్లకోసారి మహా సామ్రాజ్య పట్టాభిషేకం వైభవంగా జరుగుతుంది. భద్రాచలంలో 1927లో, 1987లో ఈ వేడుక జరిపారు. మళ్లీ 2047లో మాత్రమే మహాపట్టాభిషేకం జరుగుతుంది. ఇది కాకుండా ప్రతి 12 సంవత్సరాలకోసారి పుష్కర పట్టాభిషేకం జరుపుతారు. 1999, 2011లో ఈ పట్టాభిషేకం జరగగా, మళ్లీ ఈ ఏడాది 2023లో ఈ కార్యక్రమం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో జరగనుంది. శ్రీరామనవమి, ముక్కోటి ఉత్సవాలు విజవయంతం కావడంతో తిరిగి పుష్కర పట్టాభిషేక మహోత్సవాలను విజవయంతం చేయటానికి దేవస్థాన వైదిక కమిటీ, అధికారులు సమాలోచనలు చేస్తున్నారు. పాల్గొనే ముఖ్య అతిథులకు ఆహ్వానాలతో పాటుగా జరపాల్సిన శాస్త్రోక్త కార్యక్రమాలపై ప్రధాన దృష్టి సారించారు. మార్చి 30న శ్రీరామనవమి, 31న జరిగే పుష్కర పట్టాభిషేకంల కార్యాచరణపై సంక్రాంతి అనంతరం అంతర్గత సమావేశాలను దేవస్థానం అధికారులు, వైదిక కమిటీలు నిర్వహించనున్నాయి.

పొదెం వీరయ్యపై అసంతృప్తి బావుటా..

- ఒంటెద్దు పోకడ పోతున్నారని మండిపాటు
- 'సేవ్ కాంగ్రెస్' పేరిట ఆరు మండలాల నాయకుల భేటీ


సమావేశంలో అభివాదం చేస్తున్న నాయకులు

టేకులపల్లి: అందరినీ కలుపుకుపోతూ జిల్లాలో కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేయాల్సిన డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య ఒంటెద్దు పోకడలు, ఇష్టారాజ్య వ్యవహారశైలితో ముందుకు సాగుతున్నారని కాంగ్రెస్ జిల్లా నాయకులు భూక్యా దళ్‌సింగ్‌నాయక్, లక్కినేని సురేందర్‌రావు మండిపడ్డారు. 'సేవ్ కాంగ్రెస్'పేరిట టేకులపల్లి, ములకలపల్లి, మణుగూరు, దమ్మపేట, అశ్వారావుపేట, అన్నపురెడ్డిపల్లి మండలాల అధ్యక్షులు, నాయకులు పలువురు టేకులపల్లిలో దళ్‌సింగ్‌నాయక్ అధ్యక్షతన మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి, డీసీసీ అధ్యక్షుడికి తాము వ్యతిరేకం కాదని, ఆయన అనాలోచిత చర్యల వల్ల పార్టీ ప్రతిష్ట దెబ్బతింటుండటంతోనే ఆవేదనకు లోనవుతున్నట్లు తెలిపారు. కొందరి మాటలు నమ్మి పార్టీ కోసం అంకితభావంతో పని చేస్తున్న వారిని ఇబ్బంది పెట్టడం, పార్టీ పదవుల నుంచి తొలగించడం సరికాదన్నారు. పక్క జిల్లా నుంచి పొదెం వీరయ్య వలస వచ్చినా పార్టీపై గౌరవంతో కష్టపడి గెలిపిస్తే ఇప్పుడు నాయకులు, కార్యకర్తలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇల్లెందు నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అభ్యర్థిని ఓడించే సత్తా కాంగ్రెస్‌కు ఉన్నందున శ్రేణుల్లో ఉత్తేజాన్ని నింపి ఐక్యంగా పార్టీని ముందుకు నడిపించేలా పొదెం వీరయ్య వ్యవహరించాలని కోరారు. కాగా, ఈ నెల 26న భద్రాచలంలో ప్రారంభం కానున్న రేవంత్‌రెడ్డి పాదయాత్రకు వేలాదిగా తరలి రావాలని నాయకులు పిలుపునిచ్చారు. అనంతరం డాక్టర్ శంకర్‌నాయక్ మాట్లాడుతూ టీఆర్‌ఎస్‌లో ఉంటూ తెలంగాణ కోసం పోరాడగా అధికారంలోకి వచ్చాక జరిగిన మార్పులతో కాంగ్రెస్‌లో చేరినట్లు తెలిపారు. ఇప్పుడు ఇక్కడ కూడా గ్రూపు రాజకీయాలు మొదలయ్యాయని చెప్పారు. భద్రాద్రి జిల్లాలో ఐదుకు ఐదు నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌ను గెలిపించుకునేందుకు కార్యకర్తలు, నాయకులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కిశోర్, విజయలక్ష్మి, భూక్య గంగ, టేకులపల్లి, ములకలపల్లి, మణుగూరు, దమ్మపేట, అశ్వారావుపేట, అన్నపురెడ్డిపల్లి మండలాల అధ్యక్షులు గుండా నరసింహారావు, పేటేటి నరసింహారావు, గురిజాల గోపి, హరిబాబు, చెన్నకేశవరావు, బానోతు భీముడుతో పాటు ఊకె రామకృష్ణ, ఉదయ్, లక్ష్మీనారాయణ, గుడిపూడి సత్యనారాయణ, దామోదర్‌రావు, తాడోజు భిక్షమయ్య, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

దమ్మపేట: జాతీయస్థాయి గ్రామీణ క్రీడలకు ఎంపికైన ఆశ్రమ పాఠశాల విద్యార్థులను ఐటీడీఏ ఏటీడీఓ చంద్రమోహన్, హెచ్‌ఎం ధర్మ మంగళవారం అభినందించారు. మండల పరిధిలోని పార్కలగండి ఆశ్రమ పాఠశాల విద్యార్థులు రంజిత్, సంతోష్ గత నెల 16న జిల్లా కేంద్రం కొత్తగూడెంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి గ్రామీణ క్రీడల్లో అథ్లెటిక్స్ విభాగంలో ప్రతిభ కనబర్చి జాతీయస్థాయికి ఎంపికయ్యారని వ్యాయామ ఉపాధ్యాయుడు బొల్లి గోపాల్‌రావు తెలిపారు. ఈ నెల 10 నుంచి 13 వరకు బిహార్ రాష్ట్రంలోని పాట్నాలో జరిగే జాతీయస్థాయి గ్రామీణ క్రీడల్లో ఎంపికైన విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల అధ్యాపక సిబ్బంది, స్థానిక నాయకులు తదితరులు అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొర్సా సాగర్, పీఈటీ బాబూరావు, వార్డెన్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగు పరిశీలన


బొప్పాయి పంటను పరిశీలిస్తున్న మరియన్న

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలోని పలు మండలాలలో ఉద్యాన పంటల సాగును మంగళవారం జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖాధికారి జినుగు మరియన్న నేతృత్వంలో అధికారులు పరిశీలించారు. జిల్లాలోని సుజాతనగర్, జూలూరుపాడు, చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి, చుంచుపల్లి మండలాల్లో సాగులో ఉన్న ఆయిల్‌పామ్ తోటలు, అంతర పంటలు, కూరగాయలు, బొప్పాయి, మునగ, సీతాఫలం, నేరేడు, వెదురు, టేకు తదితర పంటలను పరిశీలించారు. ఆయిల్‌పామ్, బిందు సేద్య రాయితీలు, ప్రోత్సహకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా జిల్లా ఉద్యాన శాఖాధికారి జినుగు మరియన్న రైతులకు సూచించారు. కార్యక్రమంలో కార్యాలయ అధికారి సముద్రాల విజయ్‌కుమార్, ఆయిల్‌పామ్, బిందు సేద్య ప్రతినిధులు రాము, ఖాసీం, అజయ్, సాయికిరణ్, రైతులు రాంబాబు, మధు, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు హాస్టల్ విద్యార్థినుల అదృశ్యం

- సీసీ కెమెరాల పుటేజీ ద్వారా విచారణ
- అనుమానితుల్లో ఒకరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు


హాస్టల్‌లో సిబ్బందిని విచారిస్తున్న ఏఎస్‌ఐ జయబాబు

సత్తుపల్లి: ఇద్దరు హాస్టల్ విద్యార్థినులు అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. సత్తుపల్లి బాలికల గిరిజన ప్రభుత్వ వసతిగృహంలో ఉంటున్న సత్తుపల్లి మండలం సిద్ధారానికి చెందిన 10 తరగతి విద్యార్థినితో పాటు భద్రాద్రి జిల్లా కొత్తగూడెంనకు చెందిన 9వ తరగతి విద్యార్థిని సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు హాస్టల్ నుంచి బయటకు వెళ్లినట్లు సమాచారం. ఈ నెల 1వ తేదీన నూతన సంవత్సర వేడుకలకు సిద్ధారంలోని ఓ బాలిక ఇంటికి, అదేరోజు గంగారంలోని ఆమె పెద్దనాన్న ఇంటికి వెళ్లారు. ఆ తర్వాత అశ్వారావుపేటకు వెళ్లినట్లు ఫోన్‌లో తండ్రికి సమాచారం అందగా అయన వెళ్లి పిలుచుకొచ్చాడు. ఇక 2వ తేదీ సోమవారం ఉదయం సత్తుపల్లిలో కొత్త బట్టలు ఇప్పించి వారిని హాస్టల్‌లో వదిలాడు. అయితే, పాఠశాలకు వెళ్లాలని సూచించిన వార్డెన్ మాధవి హాస్టల్‌లో జరుగుతున్న మరమ్మతు పనులను పర్యవేక్షించటానికి వెళ్లింది. మధ్యాహ్న భోజనం అనంతరం ఇద్దరు బాలికలు బయటకు వెళ్లిపోగా, సాయంత్రం హాజరు నమోదు సమయాన గుర్తించి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. అటు హాస్టల్ సిబ్బంది, ఇటు తల్లిదండ్రులు ఎక్కడ వెతికినా ఆచూకీ లేకపోవడం, తల్లిదండ్రులు హాస్టల్‌కు వచ్చి ఆందోళన చేపట్టడంతో మంగళవారం ఉదయం పోలీసులకు హాస్టల్ వార్డెన్ ఫిర్యాదు చేశారు. దీంతో ఏఎస్‌ఐ జయబాబు హాస్టల్‌కు చేరుకుని విచారణ చేపట్టారు.

తొలుత ఖమ్మం.. ఆపై..!

హాస్టల్ విద్యార్థినుల అదృశ్యంపై ఆందోళన వ్యక్తం కావటంతో పోలీసులు పలు కోణాల్లో విచారణ వేగవంతం చేశారు. హాస్టల్ పరిసర ప్రాంతాల సీసీ కెమెరాలన్నీ పరిశీలించగా ఇద్దరు విద్యార్థినులు సోమవారం బస్టాండ్ వైపు చేతిసంచితో వెళ్తున్నట్లు గుర్తించారు. బస్సులో ఖమ్మం వెళ్లి అక్కడి నుంచి ఇతర ప్రాంతానికి వెళ్లి ఉండొచ్చని భావిస్తున్నారు. దీంతో అనుమానితుడిగా భావిస్తున్న ఒకరిని అదుపులోకి తీసుకోగా, మరొకరి ఫోన్ స్విచాఫ్‌గా ఉండటంతో ఆయన స్వగ్రామానికి పోలీసు సిబ్బందిని పంపించారు. కాగా, ఇద్దరు బాలికలు అదృశ్యమైన ఘటనపై వారి తల్లిదండ్రుల ఫిర్యాదుతో విచారణ చేపడుతున్నట్లు పట్టణ సీఐ టి.కరుణాకర్ తెలిపారు.

బోధనోపకరణాలతో సృజనాత్మకత పెరుగుతుంది

మండలస్థాయి టీఎల్‌ఎం మేళాలో డీఈఓ సోమశేఖర శర్మ


ప్రాజెక్టులను పరిశీలిస్తున్న డీఈఓ సోమశేఖర శర్మ

జూలూరుపాడు: విద్యార్థుల్లో సృజనాత్మకత, నైపుణ్యం పెంపొందించేందుకు బోధనోపకరణాలు ఎంతో దోహద పడతాయని డీఈఓ సోమశేఖరశర్మ అన్నారు. మంగళవారం మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో స్థానిక కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో ఏర్పాటు చేసిన తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా మండలస్థాయి బోధనోపకరణాల (టీఎల్‌ఎం) మేళాను ఎంపీడీఓ తాళ్లూరి రవి, ఎంఈఓ గుగులోత్ వెంకట్‌తో కలిసి జూలూరుపాడు జెడ్పీటీసీ సభ్యురాలు భూక్యా కళావతి ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు తయారు చేసిన టీఎల్‌ఎం ప్రాజెక్టులను మేళాలో ప్రదర్శించారు. మండలస్థాయి మేళాలో ప్రదర్శించిన ఉత్తమ 20 బోధనోపకరణాలను జిల్లా స్థాయి మేళాలో ప్రదర్శిస్తామని ఎంఈఓ వెంకట్ తెలిపారు. కాగా, మండలస్థాయి టీఎల్‌ఎం మేళాను డీఈఓ సోమశేఖర శర్మ సందర్శించి, బోధనోపకరణాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు తయారు చేసిన బోధనోపకరణాలు విద్యార్థుల సామర్థ్యాలను పెంచేందుకు ఉపయోగపడతాయన్నారు. విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు అదనపు సమయాన్ని కేటాయించేందుకు సైతం ఉపాధ్యాయులు ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గుండెపిన్ని విజయ, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు రామిశెట్టి శ్రీనివాసరావు, దుర్గాప్రసాద్‌రావు, బాలాజీ, కేజీబీవీ ఎస్‌ఓ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

కలల తీరం చేరకుండానే..

- డివైడర్‌ను ఢీకొని అన్నాచెల్లెళ్లు మృతి
- ఉద్యోగం వచ్చిందన్న సంతోషంలో బిర్యానీ తినొస్తుండగా ఘటన


నీరజ్ (ఫైల్)


నిహారిక (ఫైల్)

కొత్తగూడెంరూరల్: తల్లిదండ్రులు చిన్నతనంలోనే చనిపోయారు. నాయనమ్మ, పెద్దనాన్న పెంచి పెద్ద చేశారు. ఈ విషయాలను గమనిస్తూ పెరిగిన ఆ అన్నాచెల్లెళ్లు కష్టపడి చదువుకోగా అన్న ప్రైవేట్ ఉద్యోగం సాధించాడు. చెల్లి కూడా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఎంపిక కాగా రెండు రోజుల్లో ఉద్యోగంలో చేరాల్సి వచ్చింది. ఈ సంతోష సమయాన బిర్యానీ తినేందుకు వెళ్లొస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరూ మృత్యువాత పడ్డారు. ఇదే ఘటనలో మరో యువతి తీవ్రంగా గాయపడింది. వివరాలిలా ఉన్నాయి. చుంచుపల్లి ఎస్‌కే నగర్‌కు చెందిన నరికంటి నీరజ్ (27), నిహారిక (22) తల్లిదండ్రులు కొన్నేళ్ల కిందట మృతిచెందారు. అప్పటి నుంచి వారిని పెద్దనాన్న అశోక్‌కుమార్, నాయనమ్మ పెంచి పెద్దచేశారు. అశోక్‌కుమార్ సింగరేణిలో జూనియర్ మైనింగ్ ఆఫీసర్‌గా పనిచేస్తుండగా, నీరజ్ కార్ల షోరూంలో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా ఉద్యోగానికి కుదిరాడు. ఇక నిహారికకు ఇటీవలే హైదరాబాద్‌లోని సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం వచ్చింది. ఆమె రెండు రోజుల్లో విధుల్లో చేరాల్సి ఉంది. ఈ నేపథ్యాన నిహారిక స్నేహితురాలు విద్యానగర్‌కు చెందిన జలగం మేరీతో కలిసి ముగ్గురూ సోమవారం రాత్రి ద్విచక్ర వాహనంపై పాల్వంచకు వెళ్లారు. అక్కడ హోటల్‌లో బిర్యానీ తిని తిరిగి కొత్తగూడెం వైపు వస్తుండగా రేగళ్ల క్రాస్ రోడ్డు సమీపాన ద్విచక్రవాహనం డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలైన నీరజ్, నిహారిక అక్కడికక్కడే మృతిచెందగా, తీవ్రగాయాలైన మేరీని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, తల్లిదండ్రులను కోల్పోయి జీవితంలో స్థిరపడాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్న అన్నాచెల్లెళ్లను రోడ్డు ప్రమాదం బలితీసుకోగా, వారి కుటుంబంలో విషాదం అలుముకుంది.

వ్యక్తి అదృశ్యం

అశ్వారావుపేటరూరల్: ఓ వ్యక్తి కనిపించకుండా పోవడంతో మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక ఎస్‌ఐ సాయికిశోర్‌రెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని వినాయకపురం గ్రామానికి చెందిన యర్ర ఏసుబాబు అనే వ్యక్తి గత ఏడాది డిసెంబర్ 24వ తేదీన ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు తమ బంధువులు, స్నేహితుల వద్ద గాలించగా ఆచూకీ లభ్యం కాలేదు. ఏసుబాబు భార్య సంగీత చేసిన లిఖిత పూర్వక ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నాణ్యమైన, పౌష్టికాహారం అందించాలి


రికార్డులను పరిశీలిస్తున్న స్వర్ణలత లెనీనా

మణుగూరురూరల్: పిల్లలకు నాణ్యమైన, పౌష్టికాహారాన్ని అందించాలని డీడబ్ల్యూఓ స్వర్ణలత లెనీనా సూచించారు. మణుగూరు సందర్శనలో భాగంగా ఆమె మంగళవారం శివలింగాపురం చిల్డ్రన్స్ హోమ్‌ను సందర్శించారు. నూతన సంవత్సరం సందర్భంగా చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి మిఠాయిలను పంపిణీ చేశారు. అనంతరం పిల్లలకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో పోషకాహార లోపం ఉన్న చిన్నారులను గుర్తించి వారికి పౌష్టికాహారం అందేలా చూడాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు, చిల్డ్రన్స్ హోమ్ కేర్ సిబ్బందికి సూచించారు. అనంతరం ఐసీడీఎస్ సీడీపీఓ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో మణుగూరు సీడీపీఓ జయలక్ష్మి, బూర్గంపాడు సీడీపీఓ ప్రమీల, దుమ్ముగూడెం సీడీపీఓ సలోమి, టేకులపల్లి సీడీపీఓ కనకదుర్గ, మణుగూరు ప్రాజెక్ట్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఆవు దూడకు అరుదైన శస్త్ర చికిత్స


చికిత్స అనంతరం ఆవు దూడ

పినపాక: మండల కేంద్రంలోని పశువుల ఆస్పత్రిలో మంగళవారం అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించారు. అనంతరం పశువైద్యాధికారి బాలకృష్ణ చౌహాన్ మాట్లాడుతూ కరకగూడెం మండలం తాటిగూడెం గ్రామానికి చెందిన నడ్డి ముత్తయ్య ఇంట్లోని ఆవు.. దూడకు జన్మనిచ్చింది. దూడ పుట్టిన అనంతరం మల ద్వారం లేదని గుర్తించిన రైతు దూడను పినపాక పశువుల ఆస్పత్రికి తీసుకువచ్చారు. గమనించిన వైద్యులు అది అరుదుగా వచ్చే జన్యుపరమైన లోపమని తెలిపారు. అనంతరం శస్త్రచికిత్స చేసి శాశ్వత మల ద్వారాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఇక నుంచి ఎలాంటి సమస్య ఉండదని తెలిపారు. చికిత్సలో పశువైద్య సిబ్బంది శ్వేత, గోపాలమిత్ర నిర్మల, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పని చేయించుకుని డబ్బు ఎగ్గొట్టారు..

జీపీ కార్యాలయానికి తాళం.. ఆందోళన


జీపీ కార్యాలయానికి తాళం వేస్తున్న సూరమ్మ

జూలూరుపాడు: పల్లె ప్రకృతివనంలో పని చేయించుకుని డబ్బులు ఎగ్గొట్టారని ఆరోపిస్తూ ఓ మహిళ ఆందోళనకు దిగింది. వివరాలిలా ఉన్నాయి. పాపకొల్లుకు చెందిన గుంటి సూరమ్మ రోజువారి కూలీగా పల్లె ప్రకృతి వనంలో పనిచేసింది. నెలకు రూ.5,500 చొప్పున ఇస్తామనడంతో ఏడాదిన్నర పాటు పనిచేయగా ఆరు నెలల జీతమే ఇచ్చారు. మిగతా 12 నెలల వేతనం ఇవ్వకపోగా, సర్పంచ్, కార్యదర్శి తిప్పుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. ఆమె మంగళవారం పెట్రోల్ సీసాతో గ్రామపంచాయతీ కార్యాలయం వద్దకు వచ్చి ఆందోళన చేపట్టింది. డబ్బులు ఇవ్వకపోతే ఆత్మహత్య చేసుకోవడానికైనా సిద్ధమేనంటూ జీపీ కార్యాలయానికి తాళం వేసింది. ఆమెకు వార్డు సభ్యులు అజ్మీరా రాంబాబు, రామిశెట్టి రాంబాబుతో పాటు వివిధ పార్టీల నాయకులు యాసా నరేశ్, ఊడల వెంకటేశ్వర్లు, బానోత్ నవీన్ రాథోడ్, నునావత్ రాందాస్ మద్దతు తెలిపారు. దీంతో ఎంపీఓ రామారావు చేరుకుని, పాలకవర్గాన్ని సమావేశపరిచి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పడంతో ఆమె ఆందోళన విరమించింది.

ఆన్‌లైన్ యాప్‌లో రూ.2లక్షలు స్వాహా

ఖమ్మంఅర్బన్: పెట్టుబడికి రెట్టింపు చెల్లిస్తామని ఆన్‌లైన్ యాప్ మెసేజ్‌ను నమ్మిన ఓ విద్యార్థి రూ.2లక్షలు నష్టపోయాడు. ఖమ్మం అర్బన్ పోలీసుల కథనం ప్రకారం.. ఖమ్మం మమత రోడ్డులోని అపార్ట్‌మెంట్‌లో ఉండే విద్యార్థి ఎం.నిఖిల్ నాయక్ ఆన్‌లైన్ యాప్‌లో పెట్టుబడికి రెట్టింపు ఇస్తామంటూ వచ్చిన ప్రకటన చూశాడు. దీంతో ఆయన రూ.2,37,710 చెల్లించగా, రెట్టింపు ఏమో కానీ యాప్ నిర్వాహకులు స్పందించకపోవడంతో మోసపోయినట్లు గుర్తించాడు. ఘటనపై మంగళవారం బాధితుడు చేసిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.